కమనీయం.. లక్ష్మీమాధవుడి రథోత్సవం



అశేష జనవాహిని మధ్య ముందుకు తరలుతున్న లక్ష్మీమాధవస్వామి రథం

- గోవింద నామస్మరణతో మార్మోగిన గోరంట్ల
- రథోత్సవ కార్యక్రమానికి తరలివచ్చిన అశేష జనవాహిని

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం గోరంట్లలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలు మూలల నుంచే గాక కర్ణాటక, అనంతపురం, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వేదపండితుల మంత్రోచ్చరణ, మేళతాళాలతో శ్రీలక్ష్మీ, భూదేవి మాధవస్వామి విగ్రహాలను రథంపై ఆశీనులు చేయగా, భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి స్వామి వారికి పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా కోడుమూరు సీఐ తబ్రేజ్ ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు శ్రీనివాసులు, తిమ్మయ్య, తిమ్మారెడ్డి తమ సిబ్బందితో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.



స్వామివారి సేవలో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

ప్రతాప్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



ప్రతాప్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి (56) మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. గుండెపోటుతో మృతిచెందిన ప్రతాప్‌రెడ్డి అంత్యక్రియలను గురువారం చనుగొండ్ల గ్రామంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. ప్రతాప్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సుధాకర్, మణిగాంధీ, కోడుమూరు, గూడూరు, కర్నూలు మండలాల జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్ పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు భారీగా గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

హామీలను అమలు చేయాలి

కోడుమూరు రూరల్: ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో చేనేత కార్మిక సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాధవస్వామి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేనేతలకు అనేక హామీలిచ్చిందని, వాటన్నింటినీ త్వరగా నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో చేనేత రంగానికి ఎక్కువగా నిధులు కేటాయించడంతో పాటు, చేనేతలకు రూ.5 లక్షల వరకు రుణాలివ్వాలని, కార్మికులు నేసిన చీరలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, జీఎస్టీ పూర్తిస్థాయిలో రద్దు చేయాలని కోరారు. స్థానిక చేనేత కార్మిక సంఘం నాయకులు నరసింహులు, వలి, చిన్న బాషా, విజయ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి

పాఠశాలను యథావిధిగా కొనసాగించాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న వెంకటగిరి వాసులు

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఇతర పాఠశాలలో విలీనం చేయకుండా అక్కడే కొనసాగించాలంటూ ఎస్సీ కాలనీవాసులు ఎంఈఓ వసంతలక్ష్మికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన్ ప్రసాద్, సభ్యులు గిడ్డయ్య, దేవరాజు, పాలు, జయరాముడు, దుబ్బన్న, రంగన్న మాట్లాడుతూ.. వెంకటగిరి ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 35 మందికి పైగా విద్యార్థులున్నప్పటికీ వేరే కాలనీలోని పాఠశాలలో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల చిన్న పిల్లలు బడికి నడిచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకొని కాలనీలోనే పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని ఎంఈఓను కోరారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

సి.బెళగల్: పోషణ బీ, పఢాయి బీ కార్యక్రమ అమలులో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించినట్లు సి.బెళగల్ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో గురువారం మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభంకాగా, శనివారం వరకు కొనసాగుతుందని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు అంగన్‌వాడీ కేంద్రాలలో 3- 6 సంవత్సరాల చిన్నారుల పోషణ, వికాసంకు దోహదపడేలా తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలియజేశారు.



శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని జహీరాబాదులో నిర్వహించనున్న 46వ జాతీయ స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైన హ్యాండ్‌బాల్ క్రీడాకారులు మహమ్మద్ రఫీ, షేక్ అశ్రావుల్‌ను గురువారం జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి సువర్ణలు అభినందించారు.



హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలకు ఎంపికైన మహమ్మద్ రఫీ, షేక్ అశ్రావుల్

పోషణ్ అభియాన్‌పై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ఎంఈఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ అభియాన్‌పై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగ సుంకమ్మ మాట్లాడుతూ 0-6 సంవత్సరాల వయస్సున్న పిల్లలకు అందించాల్సిన పోషణపై శిక్షణ ఇస్తున్నామన్నారు. వారికి ఏ సమయంలో ఎలాంటి పోషణ అందించాలో అవగాహన కల్పిస్తున్నారమని చెప్పారు.

క్లాప్ ఆటోలను పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో చెత్తను సేకరించే క్లీన్ ఏపీ (క్లాప్) ఆటోలను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో 100 క్లాప్ ఆటోలను చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆటోలను నిలుపుదల చేయడంతో వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోందన్నారు. ఏ వీధిలో చూసినా దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ముఖ్యంగా దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్లాప్ ఆటోలను పునరుద్ధించాలని, లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

కథలు, పాటల రచన పోటీలు

కర్నూలు కల్చరల్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే పురస్కరించుకొని ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కథలు, పాటల రచన పోటీలు - 2025కు రచనలను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కథల పోటీలో ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు పాటల రచనల పోటీలో ప్రథమ బహుమతి రూ.5 వేలు,ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. సామాజిక స్పృహతో కూడిన రచనలు ఉండాలని పేర్కొన్నారు. ప్రజా శక్తి సాహితీ సంస్థ మేడే కథలు, పాటల రచన పోటీ 2025, ప్రజా శక్తి భవన్, డోర్ నంబర్ 12-402/1/1, అమరారెడ్డి కాలనీ, అరవిందా హైస్కూల్ వద్ద, తాడేపల్లి -522501 చిరునామాకు ఏప్రిల్ 25 లోగా రచనలు పంపాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



చిమ్మె మారెన్న (ఫైల్)

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ పాఠశాలలో 2017 నుంచి ఇంగ్లిషు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చిమ్మె మారెన్న(61) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. పాఠశాలలో విధులు ముగించుకుని నంద్యాలలోని ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. స్థానిక ఆసుపత్రికి తరలించి పరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఉపాధ్యాయుడు మారెన్నకు భార్య ఉన్నారు. ఇక్కడకి రాకముందు కరిమద్దెల జెడ్పీపాఠశాలలో 2009-2017 వరకు పనిచేశారు.

మారెన్న అకాలమృతికి ఏపీటీఎఫ్ సంతాపం

ఉపాధ్యాయుడు చిమ్మె మారెన్న అకాలమృతికి నంద్యాల జిల్లా ఏపీటీఎఫ్ సంతాపం తెలియజేస్తూ వారి కటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. సంఘం నాయకులు నంద్యాలలోని ఆయన ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు, రాష్ట్ర అకాడమిక్ కమిటి సభ్యుడు సాంబశివుడు, జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి, మండలశాఖ అధ్యక్షులు ప్రతాపరెడ్డి తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు రామకృష్ణ

గడివేముల: స్టీల్ ప్లాంట్ పరిశ్రమకు నీటి సరఫరా నిమిత్తం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు వరకు పైపులైన్ నిర్మాణంలో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ కోరారు. ఈ నెల 22వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని పూడిచెర్ల గ్రామానికి రానున్న నేపథ్యంలో గురువారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ల కోసం పనిచేస్తుందా? లేక బక్కచిక్కిన చిన్న, సన్నకారు రైతుల కోసం పనిచేస్తుందా? ప్రశ్నించారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి నీటి సరఫరా కోసం ఆఘమేఘాలపై పైపులైన్ నిర్మాణ పనులు పూర్తిచేశారని తెలిపారు. ఆ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఒక్కపైసా చెల్లించకపోవడం అన్యాయమని విమర్శించారు. తమ పాలన వస్తే, రైతుల అభ్యున్నతి కోసం పనిచేస్తామని ఎన్నికల సమయంలో చెప్పారని, ఇదేనా అభ్యున్నతి అంటే అని ప్రశ్నించారు. రైతుల పొలా ల్లో పెద్దపెద్ద గోతులు తీయడం వల్ల భూములు పాడై, సాగుకు పనికిరాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులతో మాట్లాడి నష్టపోయిన రైతులకు సరైన పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, రైతు సంఘం నాయకులు చంద్రబాబు, మధు, శ్రీధర్, రైతులు వెంకటేశ్వర్లు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయాలి

గడివేముల: రసాయన ఎరువుల ద్వారా ఉత్పత్తి చేసిన పంట దిగుబడుల వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్న తరుణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తరింపచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీఎల్‌ఎంపీ లక్ష్మయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పొదుపు భవనంలో మండల స్థాయి అనుసంధాన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి లక్ష్మయ్యతో పాటు మండల వ్యవసాయ అధికారి సుధాకర్, టీమ్ లీడర్ వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా సంఘాల పాత్ర, మండల సమాఖ్య ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేసే సంస్థగా ఎలా పనిచేస్తుంది, వివిధ శాఖల అనుసంధాన ప్రాముఖ్యతను గురించి డీఎల్‌ఎంపీ లక్ష్మయ్య తెలిపారు. మండల సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి ప్రకృతి వ్యవసాయానికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి సుధాకర్ మాట్లాడుతూ.. ప్రతి మహిళ సంఘం పది ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేయాలని పిలుపునిచ్చారు. దేశీ విత్తనాల వాడకం వల్ల మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంటీఎల్ వంశీకృష్ణ, హెచ్ఎన్ఎస్ఎఫ్ఎఫ్ యశ్వని, వైపీ లావణ్య, ఎంటీలు ఖాసిం, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన

కల్లూరు: జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ చిన్నటేకూరులో గురువారం ఫ్లోరోసిస్ వలన కలిగే సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా ఒక లీటర్ నీటికి ఫ్లోరైడ్ 1.5 పీపీఎం (పార్ట్స్‌పెర్ మిలియన్) కన్నా ఎక్కువ ఉండకూదన్నారు. ఫ్లోరైడ్ నీటిని తాగడం వలన దంతాలు పసుపు, గోధుమ రంగులోకి మారతాయన్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎముకలు బోలుగా మారడం, వంగిపోయిన కీళ్లు, కండరాల బలహీనత, పిల్లల పెరుగుదలపై ప్రభావం చూపుతుందన్నారు. అలాగే బీడీ, చుట్ట, పాన్, పాన్ మసాలా వంటివి ఉపయోగించడం వలన ఫ్లోరోసిస్ సంబంధిత ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కాల్షియం, విటమిన్-సి, ఉన్న ఆహారాన్ని పాలు, గుడ్లు, రాగిజావ, ఆకు కూరాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు బిందు, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుధాకర్

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి

గడివేముల: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చొరవచూపాలని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా సూచించారు. మండల కేంద్రమైన గడివేములలోని సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు చెత్తను బయట పడవేయకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవ గు ప్తా, ఈఓపీఆర్‌డీ మహీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అంకన్న, రంగడు తదితరులు పాల్గొన్నారు.



చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ జమీవుల్లా

ఆటో బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

- మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలు
- బాధిత కూలీలంతా అగ్రహారం గ్రామస్తులే..
- బాపురం పొలాల్లో మిరప కోతలకు వెళ్తుండగా హాలహర్వి వద్ద ఘటన

ఆలూరు రూరల్: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడగా ఎనిమిది మందికి స్వ ల్ప గాయాలయ్యాయి. ఆటోలో వెళ్తున్న కూలీలంతా మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన వారే. గురువారం ఉదయం హాలహర్వి మండల కేంద్రానికి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. బాధితుల బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన 13 మంది వ్యవసాయ కూలీలు హాలహర్వి మండలం బాపురం గ్రామంలో మిరప పంట కోతలకు అప్పీ ప్యాసింజర్ ఆటోలో బయలుదేరారు. ఉదయం 7 గంటల సమయంలో హై వే 167లో ఉన్న హాలహర్వి పెట్రోల్ పంపు వద్ద ఆటో అదుపు తప్పి కిందపడింది. ప్రమాదంలో ఐశ్వర్య,రాధమ్మ, లింగమ్మ తలలకు తీవ్రగాయాలయ్యాయి. విజయలక్ష్మితో పాటు ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు.



గాయపడిన యువతి ఐశ్వర్య



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాధమ్మ

బైక్‌లు ఢీ..వ్యక్తికి తీవ్రగాయాలు

బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నాగరాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం సాయంత్రం ఆలూరు సమీపంలోని పాండురంగ స్వామి ఆలయ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. హాలహర్వి మండలం మాచనూరు గ్రామానికి చెందిన నాగరాజు పని నిమిత్తం ఆలూరుకు వచ్చి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఆలూరుకు చెందిన వీరేష్ ఆలూరు వైపు బైక్‌పై వస్తుండగా రెండు మోటారు సైకిళ్లు బలంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో నాగరాజు తలకు తీవ్ర గాయాలవగా.. వీరేష్ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు నాగరాజును మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.



గాయపడిన నాగరాజు

క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం



సంగాలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న అధికారులు

సి.బెళగల్: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందని కోడుమూరు తాలుకా మలేరియా అధికారి రంగస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని సంగాల గ్రామంలో డెంగ్యూ అనుమానిత కేసుపై ఆయన గ్రామంలో ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, పంచాయతీ వైద్య అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో సర్పంచ్ హనుమంతు చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను వారు పర్యవేక్షించారు. డెంగ్యూ కేసు అనుమానితుల ఇళ్లు, పరిసరాలలో దోమల మందును పిచికారీ చేయించారు. అనంతరం గ్రామస్తులకు పరిశుభ్రత, వ్యాధుల వ్యాప్తి, నివారణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతతో రోగాలు దూరమవుతాయని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సుంకన్న, ఎంఎల్‌హెచ్‌పీ హేమలత, ఏఎన్ఎం పుష్పావతి, ఆశా వర్కర్లు, గ్రామస్తులు ఉన్నారు.

ప్రాంగణ ఎంపికలు

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో బెంగళూరుకు చెందిన ' కోరో హెల్త్ కేర్' కంపెనీ వారు గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కళాశాలలో బి. ఫార్మసి, ఫార్మాడి చివరి సంవత్సరం చదువుతున్న 110 మంది విద్యార్థులు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ నిర్వహించారు. అందుల్లో 38 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. హెచ్ఆర్ మేనేజర్స్ క్లింటన్ రాజ్, సౌందర్ విద్యార్థులకు ఎంపిక పత్రాలను అందించారు. కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

పరిశుభ్రతపై అవగాహన

కల్లూరు: మండల పరిధిలోని సల్కాపురం గ్రామంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. గురువారం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ మంజుల రాణి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అన్నపూర్ణ, నాగరత్న, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: నంద్యాల జిల్లాలో ఉన్న బీసీ, బాల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తు చేరుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలల నంద్యాల జిల్లా కన్వీనర్ బి.ఫ్లోరమ్మ గురువారం తెలిపారు. బొమ్మల సత్రం, బనగానపల్లె, ఆత్మకూరు, ఆళ్లగడ్డ పాఠశాలలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 25 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ 98665 59668, 94407 25929కు సంప్రదించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పాణ్యం: మండల పరిదిలోని నెరవాడ మెట్ట వద్ద నెరవాడ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైన తరుణంలో బాటసారులకు, వాహనదారులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ఆటో యూనియన్ నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గడివేముల: ప్రతి రోజు యోగా సాధన చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా జీవించవచ్చని నందిపైపుల అధినేత సుజల తెలిపారు. గురువారం స్థానిక రాజరాజేశ్వరి హైస్కూల్ ఆడిటోరియంలో హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్, శ్రీరామ చంద్రమిషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా, ముద్రలు, ధ్యానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యోగా, ధ్యానం చేయడం వలన ఒత్తిడి, భయం దూరమవుతాయన్నారు. అలాగే ఏకాగ్రత, మంచి నిద్ర, రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఇంకా రెండు రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు, హెచ్ఎం రాఘవేంద్రరావు, యోగా ఉపాధ్యాయులు ఆశ, అరవింద వాణి, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు డిప్యూటీ సీఎం పర్యటన

కల్లూరు: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శనివారం ఓర్వకల్లు మండలంలో పర్యటించనున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూటమి పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యటనలో భాగంగా ఓర్వకల్లు మండలంలో పూడిచెర్ల వద్ద జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఫారంపాండ్స్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారన్నారు. కార్యకర్తలు, నాయకులు డిప్యూటీ సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.